సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 2, జనవరి, 2025



అందని 'కాయకల్ప'

భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ఈ ఏడాది కూడా కాయకల్ప అవార్డు దక్కకపోవడంతో ఆస్పత్రి వర్గాలు నిరాశ చెందుతున్నాయి. 8లో



ముగిసిన ఆర్చరీ పోటీలు

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు బుధవారం ముగిశాయి. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 15°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. తెల్లవారు జామున, రాత్రి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో 'నూతన' సందడి

అమ్మవారికి విశేష పూజలు



వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. కాగా, అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్..

నూతన సంవత్సరం సందర్భంగా పెద్దమ్మతల్లి అమ్మవారిని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఈఓ రజనీకుమారి వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

కిన్నెరసానిలో సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : నూతన సంవత్సరం సందర్భంగా కిన్నెరసానిలో పర్యాటకులు బుధవారం సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 1,270 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.43,120 ఆదాయం లభించగా, 500 మంది బోటు షికారు చేయడంతో పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.27, 220 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆఖరి దశలో సర్వే..



దుమ్ముగూడెం మండలం బండారుగూడెంలో సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)



కొలిక్కి వచ్చిన 'ఇందిరమ్మ' దరఖాస్తుల పరిశీలన

- ఖమ్మం జిల్లాలో 83.96శాతం, భద్రాద్రి జిల్లాలో 70శాతం పూర్తి
- అధికారులతో ఐదు శాతం మేర 'సూపర్ చెకింగ్'
- త్వరలోనే తేలనున్న లబ్ధిదారుల సంఖ్య

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ఉమ్మడి జిల్లాలో ఓ కొలిక్కి వచ్చింది. వారం రోజుల్లో దరఖాస్తుల సర్వే పూర్తవుతుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 83.96 శాతం, భద్రాద్రి జిల్లాలో 70 శాతం మేర సర్వే పూర్తి కాగా, ఎంపీడీఓలు సూపర్ చెకింగ్ చేస్తున్నారు. ఒక్కో మండలంలో కనీసం ఐదు శాతం దరఖాస్తులను వీరు పరిశీలించి అర్హులను నిర్ధారించనున్నారు.

గతనెల 9 నుంచి..

ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే గత డిసెంబర్ 9న ప్రారంభమైంది. కొన్నాళ్ల క్రితం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ఖమ్మం జిల్లాలో ఇళ్ల కోసం 3,57,869 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 3,06,131 ఇళ్లలో పరిశీలన పూర్తయింది. ఇందులో 3,00,453 దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లోనూ నమోదు చేశారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,73,493 దరఖాస్తులకు గాను 1,90,181 ఇళ్ల సర్వే పూర్తి కాగా, మరో 83,312 దరఖాస్తులు మిగిలి ఉన్నాయి.

జిల్లాలో కాస్త నెమ్మదిగా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సర్వే కొంత మేర వేగంగా సాగింది. పాలేరు నియోజకవర్గంలో 87.59 శాతం, మధిరలో 87.10 శాతం, వైరాలో 85.15 శాతం, సత్తుపల్లిలో 84.20 శాతం పూర్తయింది. ఇక ఖమ్మం నియోజకవర్గంలో 75.73 శాతం దరఖాస్తుల పరిశీలన జరగగా, ఇది ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 72.26 శాతంగానే నమోదైంది. అయితే, భద్రాద్రి జిల్లాలో మాత్రం 70 శాతం దరఖాస్తుల పరిశీలనే పూర్తవడం గమనార్హం. ఇక్కడ ఇల్లెందు నియోజకవర్గంలో మాత్రం అత్యధికంగా 76 శాతం నమోదైంది.

నూరు శాతం కష్టమే..

దరఖాస్తుల ఆధారంగా సర్వే వంద శాతం పూర్తి చేయడం కష్టమేనని ఉద్యోగులు భావిస్తున్నారు. కొన్ని ఇళ్లను వదిలేయడంపై అధికారులు వివరణ కోరగా సిబ్బంది చెప్పిన సమాధానాలతో ఇలా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కొందరు ఒక చోట దరఖాస్తు చేసుకోగా.. వారి స్థలం మరో గ్రామంలో ఉండడం, కొందరు ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు ఇచ్చినా చిరునామాలో ఎవరూ లేకపోవడం, మరికొందరు కన్నుమూయడం, ఇంకొందరు ఫోన్లు ఎత్తడం లేదని సమాచారం. అంతేకాక పలువురు సర్వేకు వచ్చిన సిబ్బందితో తమకు ఇల్లు అవసరం లేదని చెబుతుండగా, చాలా మంది ఇతర గ్రామాల్లో నివసిస్తూ సొంత గ్రామంలో ఇల్లు కావాలని కోరుతున్నట్లు తెలిసింది. ఇలాంటి దరఖాస్తులన్నీ పోను మిగిలిన వాటినే అప్‌లోడ్ చేయనున్నారు.

మా పేర్లు ఏవీ?

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన సభల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు తమ వద్దకు సర్వే సిబ్బంది ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నారు. కానీ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయాన ఆపరేటర్ల పొరపాట్లతో యాప్‌లో పేర్లు కానరావడం లేదు. ఫలితంగా ఏదైనా వీధికి వెళ్లినప్పుడు పేర్లు లేనివారు సిబ్బందిని ఆరా తీస్తున్నారు. యాప్‌లో పేర్లు రాలేదని సిబ్బంది చెబుతుండగా వీరంతా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల కార్యాలయాలకు వెళ్లి తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇందులో పలువురు మరోమారు దరఖాస్తులు ఇస్తున్నారు.



సర్వేకు ఎప్పుడు వస్తారని కేఎంసీ ఆరా తీస్తున్న మహిళ (ఫైల్)

నాలుగైదు రోజుల్లో పూర్తవుతుంది..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ఆధారంగా సర్వే నాలుగైదు రోజుల్లో పూర్తవుతుంది. దరఖాస్తుదారులు ఒకచోట, స్థలం ఒక చోట ఉండడం, కొందరి చిరునామాలు దొరకకపోవడం, మరికొందరు ఇల్లు వద్దని చెప్పడం వంటి కారణాలతో కొన్ని దరఖాస్తులు మిగిలిపోతున్నాయి. ఇలాంటివి 14 నుంచి 15 శాతం మేర ఉండగా దరఖాస్తులపై కారణాలు రాయాలని సిబ్బందికి సూచించాం. సర్వే పూర్తయ్యాక గ్రామపంచాయతీల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కమిషనర్ ఐదు శాతం మేర సూపర్ చెకింగ్ చేస్తే లబ్ధిదారుల సంఖ్య తేలనుంది.

– బి.శ్రీనివాస్, పీడీ, గృహనిర్మాణశాఖ, ఖమ్మం

జిల్లాలో నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు, సర్వే వివరాలు

	కొత్తగూడెం	భద్రాచలం	పినపాక	అశ్వారావుపేట	ఇల్లెందు	వైరా (జూలూరుపాడు)
వచ్చిన దరఖాస్తులు	66,743	36,054	65,096	57,283	38,878	9,439
సర్వే పూర్తయినవి	45,781	23,078	48,474	36,781	29,642	6,425

కూర్మావతారంలో కనువిందుగా..



స్వామి వారిని పల్లకీ సేవగా తీసుకొస్తున్న ఈఓ, ఏఈఓ, ఇతర అధికారులు

- రామాలయంలో రెండో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు
- స్వామివారికి భక్తుల నీరాజనం
- నేడు వరాహావతారంలో దర్శనం



స్టేడియంలో వేదికపై ఆశీనులైన స్వామివారు

భద్రాచలం : క్షీరాబ్ధి సమయాన మందరగిరిని తన వీపున మోసి దేవతలకు అమృతం అందించిన కూర్మావతారంలో భద్రాద్రి రామయ్య భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశాడు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో రెండో రోజైన బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కూర్మావతారంలో అలంకరించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఆరాధన, నివేదన అనంతరం వేద పండితులు 200 నాళాయిర దివ్య ప్రబంధాలను పఠించారు. 12 మంది ఆళ్వార్లకు పరివట్టం కట్టి పూల మాలలు వేసి తులసీ దళాలు సమర్పించారు. అనంతరం కూర్మావతారంలో అలంకరించిన స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చారు. ఆంగ్ల సంవత్సరాది కావడంతో రామాలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు, సర్వదర్శనం లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కూర్మావతారంలో ఉన్న స్వామివారికి భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మిథిలా స్టేడియంలో నీరాజనం..

ప్రత్యేక పల్లకీపై స్వామివారిని వేంచేపు చేసి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ మాడవీధుల మీదుగా మిథిలా స్టేడియంలోని అధ్యయనోత్సవ వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. హారతి సమర్పించాక భక్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన సంగీత, నృత్య, కచేరి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆ తర్వాత స్వామివారు ఊరేగింపుగా తిరువీధి సేవకు వెళ్లారు. తాతగుడి వీధిలోని విశ్రాంత మండపం వద్దకు తీసుకెళ్లి కాసేపు ఉంచి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తిరిగి గర్భగుడికి తీసుకొచ్చారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుని ప్రసాదం స్వీకరించారు.

నేటి అవతార విశిష్టత..

అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి గురువారం వరాహావతారంలో దర్శనమివ్వనున్నారు. ప్రజా సృష్టి చేద్దామనుకున్న స్వాయంభువుడితో పాటు బ్రహ్మాదుల మొర విన్న నారాయణుడు నీటిలో మునిగి ఉన్న భూమిని బయటకు తీయడానికి వరాహావతారాన్ని ధరించాడు. భూమిని తన కోరలతో పైకెత్తాడు. ఈ కార్యంలో ఆటంకం కలిగించిన లోకకంటకుడైన హిరణ్యాక్షుడు అనే రాక్షసుడిని సంహరించి భూమిని రక్షించాడు. రాహు గ్రహ బాధ ఉన్న వారు ఈ అవతారంలో ఉన్న స్వామిని దర్శిస్తే విముక్తులవుతారని ప్రతీతి.

పదోన్నతుల ఉత్తర్వులు అందజేత



పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జీఎం వీసం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు ఎస్ఎల్‌పీ/టైం బౌండ్ పదోన్నతులు ఇస్తున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వుల కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎస్ఓటూజీఎం బి. వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, వివిధ విభాగాల అధికారులు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఆదివాసీ వంటకాలు వడ్డించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు వచ్చే భక్తులు, పర్యాటకులు బస చేసేందుకు ఏర్పాటు చేస్తున్న హట్స్‌ల్లో విడిది చేసే వారికి ఆదివాసీ వంటకాలనే వడ్డించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని గోదావరి కరకట్ట సమీపంలో ఏర్పాటుచేస్తున్న పర్యాటకుల విడిది గృహాల నిర్మాణ పనులను ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహాల నిర్మాణ పనులను నిర్ణీత సమయానికంటే ముందుగానే పూర్తి చేయాలని, ఈనెల 9న రివర్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్నందున ఏర్పాట్లు రెండు రోజుల ముందే పూర్తి చేసి లాంఛనంగా ట్రయల్ నిర్వహించాలని ఆదేశించారు. విడిది గృహాల వద్ద పరిశుభ్రత పాటించాలని, గృహాల సమీపంలో డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కరకట్ట వద్ద ఏర్పాటు చేసే స్టాళ్లలో ఆదివాసీ గిరిజనుల వంటలు, వస్తువులకు ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేసి నాణ్యమైన వస్తువులను భక్తులకు సరసమైన ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా పర్యాటకులకు వడ్డించే గిరిజన వంటకాల్లో మూడు రోజుల పాటు శాకాహార వంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనులు చేసి భద్రాద్రికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ దామోదర్‌రావు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వరరావు, రమణయ్య, రాజారావు, జగదీష్, కిషోర్, హరికృష్ణ, శ్రీనివాసరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఫుల్లు'గా తాగేశారు..

- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారీగా విక్రయాలు
- రూ.10 కోట్ల విలువైన మద్యం వినియోగం
- గతేడాది కంటే రూ.కోటి అదనం



పాల్వంచరూరల్ : జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటేలా సాగగా.. మందుబాబులు మాత్రం మత్తుగా పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలోని మద్యం షాపుల్లో ఎక్కడా చూసినా సందడి వాతావరణమే కనిపించింది. వైన్స్‌తో పాటు గ్రామాల్లోని బెల్ట్‌షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కొన్నిచోట్ల బీర్లు అందుబాటులో లేకపోవడంతో మద్యం ప్రియులు ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకున్నారు. ఈసారి నూతన సంవత్సరం పుణ్య మా అని మద్యం అమ్మకాలతో జిల్లా నుంచి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం భారీగానే లభించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఏ వేడుక అయినా మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి.

మద్యం విక్రయాలిలా..

ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఒక్క డిసెంబర్ 31వ తేదీనే ఇల్లెందు డివిజన్‌లో రూ.98 లక్షలు, పాల్వంచలో రూ.1.44 కోట్లు, కొత్తగూడెంలో రూ.1.43 కోట్లు, మణుగూరులో రూ.24 లక్షలు, అశ్వారావుపటలో రూ.26 లక్షలు, భద్రాచలంలో రూ.1.24 కోట్లు.. మొత్తంగా రూ.5.59 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇక బుధవారం కూడా దాదాపు అంతే మొత్తంలో మద్యం అమ్ముడైందని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

రూ.15 కోట్ల విలువైన మద్యం దిగుమతి..

జిల్లాలో 88 వైన్ షాపులు, 13 బార్ అండ్ రెస్టారెంట్లు, ఒక క్లబ్ ఉన్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా వైరాలోని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా జిల్లాకు రూ.15 కోట్ల విలువ గల వివిధ రకాల బ్రాందీ, విస్కీ కేసులు 5,866తో పాటు 5,200 బీర్ల కేసులు దిగుమతి అయ్యాయి. ఆయా షాపుల నుంచే గ్రామాల్లోని బెల్ట్ దుకాణాలకు సరఫరా చేశారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఈ రెండు రోజుల్లో రూ.10 కోట్ల విలువైన వివిధ రకాల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది రూ.9 కోట్ల మద్యం అమ్ముడవగా, ఈ ఏడాది రూ.కోటి విలువైన మద్యాన్ని అధికంగా తాగేయడం గమనార్హం.

గతేడాది కంటే అమ్మకాలు పెరిగాయి



గతేడాదితో పోల్చితే జిల్లాలో మద్యం విక్రయాలు ఇప్పుడు భారీగా పెరిగాయి. 2023 డిసెంబర్ 31, 2024 జనవరి 1 తేదీల్లో రూ.9 కోట్ల మద్యం అమ్ముడుపోగా, ఈసారి డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో రూ.10 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అంటే గతేడాది కంటే సుమారు రూ.కోటి అదనం. నూతన సంవత్సర వేడుకల కోసం వైరా బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి జిల్లాకు రూ.15 కోట్ల విలువైన మద్యం దిగుమతి అయింది.

– జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఏఎస్పీగా విక్రాంత్ బాధ్యతల స్వీకరణ



విక్రాంత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సీఐ

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మొదట ఏఎస్పీ కార్యాలయానికి చేరుకున్న విక్రాంత్.. మూడు నెలలుగా ఇన్‌చార్జ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వంగా రవీందర్ రెడ్డి నుంచి బాధ్యతలు చేపట్టారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ ప్రస్తుతం హైదరాబాద్ గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వర్తిస్తూ భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా బదిలీ అయ్యారు. కాగా జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని ప్రొబెషనరీ విధుల నిర్వహణలో భాగంగా జిల్లాలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, ఆ తర్వాత లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా 2024 మార్చి 4 నుంచి మే 25 వరకు పని చేశారు. అనంతరం ట్రైనింగ్ కోసం తిరిగి జాతీయ పోలీస్ అకాడమీకి వెళ్లగా శిక్షణ అనంతరం భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలంలో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భద్రాచలం డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా పనిచేస్తానని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం సీఐ సంజీవరావు, ఎస్ఐలు పీవీఎన్ రావు, విజయలక్ష్మి, మధుప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతనోత్సాహం..

9లో

జిల్లా వ్యాప్తంగా బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలు, ప్రార్థనా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సంవత్సరమంతా సాఫీగా సాగాలని పలువురు తమ ఇష్టదైవాలను వేడుకున్నారు. బంధు, మిత్రులను కలుసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంచుకున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న పెద్దమ్మతల్లి ఆలయం



పాల్వంచ ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

క్లుప్తంగా

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఈమేరకు గురువారం భద్రాచలంకు చెందిన గుమ్ములూరి సాయి నందిని ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. భామాకలాపంలో 'భామనే సత్యభామనే' అంటూ కూచిపూడి నృత్యం చేయగా.. ఆమెతో పాటు పలువురు చిన్నారులకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు ప్రశంసాపత్రాలతో పాటు పాటు స్వామివారి ప్రసాదం అందజేశారు.

నిత్య అన్నదానానికి విరాళం



సత్రం నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దాతలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో జరిగే నిత్య అన్నదాన కార్యమానికి పాల్వంచ పట్టణానికి చెందిన సంకా నాగేశ్వరరావు, వజ్రమ్మ దంపతులు రూ.75 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్కును సత్రం బోర్డు సభ్యులు కంభంపాటు సురేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చారుగుళ్ల శ్రీనివాస్ చేతుల మీదగా సత్రం నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్రం మేనేజర్లు సత్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో 109 శాతం బొగ్గు ఉత్పత్తి



సింగరేణి(కొత్తగూడెం): డిసెంబర్ మాసంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేసింది. సంస్థ నిర్దేశించిన 12.65 లక్షల టన్నుల లక్ష్యానికి 13.78 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 109 శాతం నమోదు చేసింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం శాలెంరాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ కొత్తగూడెం ఏరియాకు 145 లక్షల టన్నుల లక్ష్యం నిర్దేశించిందని, గడచిన 9 మాసాల్లో 100.8 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించామని తెలిపారు. మూడు మాసాల్లో మిగిలిన లక్ష్యం 45 లక్షల టన్నుల బొగ్గు వెలికితీస్తామన్నారు. వీకే-7 ఓసీ అనుమతులు వస్తే కొంత వరకైనా ఉత్పత్తి సాధిస్తామన్నారు.

ఇల్లెందులో...

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి వివరాలను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య బుధవారం తన చాంబర్‌లో వెల్లడించారు. డిసెంబర్ నెల లక్ష్యం 3.32 లక్షల టన్నులు కాగా, 3.91 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసినట్లు తెలిపారు. 118 శాతం ఉత్పత్తి సాధించామన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బొడ్డపాటి ఉపేంద్ర(25) ఓ ప్రైవేటు స్కూల్ బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక, కుటుంబ సమస్యలతో మనోవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించే సరికే మృతి చెందాడు. మృతుడికి తల్లి, సోదరుడు వెంకట రమణ ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట : మండల పరిధిలోని ఎర్రన్నపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కథనం ప్రకారం... ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10,590 నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

పల్లెప్రకృతి వనంలో..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని కట్టుగూడెం గ్రామ పల్లెప్రకృతివనంలో బుధవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ. 1500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20.506

అందని 'కాయకల్ప'

- భద్రాచలం ఏరియా ఆస్పత్రికి మూడేళ్లుగా దక్కని అవార్డులు
- గతంలో రాష్ట్రస్థాయిలో మూడుసార్లు మొదటి బహుమతి
- అవార్డుల నిధులు దాదాపు రూ. 50 లక్షలు పెండింగ్!



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్: ఈ ఏడాది కూడా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి కాయకల్ప అవార్డు దక్కలేదు. దీంతో ఆస్పత్రి వర్గాలు ఒకింత నిరాశ చెందుతున్నాయి. చివరిసారిగా 2021లో అవార్డు వచ్చింది. ఆ తర్వాత మూడేళ్లుగా అవార్డు రావడంలేదు. కాయకల్ప అవార్డు ఇచ్చేందుకు ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల్లో నాణ్యతాప్రమాణాలు, వ్యాధి సంక్రమణ, నియంత్రణ, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, భవనాలు, వైద్య పరికరాలు, నీటి వసతి, బయోమెడికల్ వేస్టేజ్, ఆపరేషన్, లేబర్ రూం నిర్వహణ తదితర 18 అంశాలను అధికారులు పరిశీలిస్తారు. ఆస్పత్రి సిబ్బంది కోసం క్రీడా వాతావరణం, యోగా, మెడిటేషన్, మొక్కల పెంపకం వంటి ఎకో ఫ్రెండ్లీ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

అన్ని సౌకర్యాలు ఉన్నా..

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప అవార్డు పొందడానికి అన్ని విధాలా అర్హతలు ఉన్నాయని అక్కడి వైద్యులు చెబుతున్నారు. అన్ని సౌకర్యాలతో అద్భుతమైన నూతన భవన నిర్మాణం, బెడ్లు, ఆక్సిజన్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్, డయాలసిస్ సేవలు, మరుగుదొడ్లు, మూత్రశాలల పరిశుభ్రత వంటి మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. గతంలో వైద్యుల కొరత ఉన్నా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ప్రారంభంకాని మినీ టీ హబ్

భద్రాచలం ఆస్పత్రికి ఏజెన్సీతోపాటు దాదాపు నాలుగు రాష్ట్రాల ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. రోగ నిర్ధారణ కోసం గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీ హబ్ సేవలను ప్రారంభించింది. భద్రాచలం ఆస్పత్రిలో కూడా మినీ టీ హబ్ ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. మూడేళ్లు గడిచినా ఇంకా ప్రారంభించలేదు. భద్రాచలం ఐటీడీఏ నూతన పీఓ ఆదేశించినా సంబంధిత అధికారులు టీ హబ్ సేవలను ప్రారంభించడంలేదు. ఈ సేవలు ప్రారంభిస్తే రోగ నిర్ధారణ పరీక్షలు వేగంగా సాగుతాయి.

గతంలో ఐదుసార్లు అవార్డు..

భద్రాచలం ఏరియా ఆస్పత్రికి గతంలో ఐదుసార్లు కాయకల్ప అవార్డు లభించింది. 2016-17 మొదటి బహుమతి రూ.20 లక్షలు, 2017-18 లో ద్వితీయ బహుమతి రూ.15 లక్షలు, 2018-19 మొదటి బహుమతి రూ.20 లక్షలు, 2019-20 ప్రోత్సాహక బహుమతి రూ.లక్ష, 2020-21లో మొదటి బహుమతి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. ఇక ఆ తర్వాత కాయకల్ప అవార్డులకు ఎంపిక కావడం లేదు. 2024 ఏడాది అవార్డు ఎంపికకు కేంద్ర అధికారుల బృందం ఆస్పత్రిలో తనిఖీలు, అసెస్మెంట్ పూర్తి చేసింది. నిర్వహణలో కొన్ని మార్పులు చేర్పులను సూచించింది. ఈ క్రమంలో కచ్చితంగా అవార్డు వస్తుందని ఆశించి ఆస్పత్రి వర్గాలకు నిరాశే మిగిలింది. కాగా గతంలో వచ్చిన అవార్డులకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి కాలేకపోతుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.50 లక్షల వరకు రావాల్సిఉందని పేర్కొంటున్నాయి.

వస్తుందనే అనుకున్నాం



ఏరియా ఆస్పత్రికి కాయకల్ప అవార్డు దక్కించుకునే అన్ని అర్హతలు ఉన్నాయి. కాయకల్ప బృందం ఆస్పత్రిని సందర్శించిన సమయంలో కచ్చితంగా అవార్డుకు ఎంపిక అవుతుందనే భావించాం. కానీ రాలేదు. సకాలంలో వైద్యం అందించి ప్రతీ రోగిని రక్షించడమే మాకు అవార్డు.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



నాగచైతన్య (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడేనికి చెందిన వాంకుడోతు నాగచైతన్య(17), అదే గ్రామానికి చెందిన మరో బాలుడు గుగులోతు రుషేంద్ర కలిసి బైక్‌పై బచ్చువారిగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామశివారులో బచ్చువారిగూడెం వైపు నుంచి మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై నాగచైతన్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రుషేంద్రకు, మరో వ్యక్తి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుమ్మడవల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. మృతుడు నాగచైతన్య అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, కొత్త సంవత్సర వేళ రోడ్డు ప్రమాదంలో రోడ్డు ప్రమాదంలో నాగచైతన్య మృత్యువాత పడటంతో కుటుంబీకుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

టిప్పర్ లారీ ఢీకొని..

మణుగూరు టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై సైకిల్‌ను వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... సమితిసింగారం పంచాయతీ అశోక్‌నగర్‌కు చెందిన అప్పన వీర్రాజు (55) తాపీ మేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పూలమార్కెట్ వైపు నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో బొగ్గు టిప్పర్ లారీ వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో వీర్రాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 100 పడకల ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. లారీ డ్రైవర్ రాచకొండ ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యుడు వెంకట్ మణుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అప్పన వీర్రాజు(ఫైల్)

భవనం పైనుంచి పడి యువకుడు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఉత్యాల ప్రసాద్ (20) మంగళవారం రాత్రి భవనం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదుతో టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

కార్డియాక్ అరెస్ట్‌తో గర్భవతి..

ములుగు జిల్లా వాజేడుకు చెందిన గర్భవతి అలేఖ్య(22)కు తీవ్రంగా వాంతులు అవుతుండగా కుటుంబ సభ్యులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యుల అలేఖ్య అప్పటికే కార్డియాక్ అరెస్టుతో మృతి చెందిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుపాతరల గుర్తింపు



మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్న దృశ్యం

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 10 శక్తిమంతమైన మందుపాతరలను పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపూర్ దుర్గా టెంపుల్ సమీపంలో రహదారిపై మావోయిస్టులు 8 మందుపాతరలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన సీఆర్‌పీఎఫ్ 168 బెటాలియన్‌కు చెందిన పోలీసులు వాటిని గుర్తించారు. బాంబు డిస్పోజబుల్ టీం వచ్చి మందుపాతరలను వెలికి తీసి నిర్వీర్యం చేసింది. తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి కొండపల్లి చుత్వాయి గ్రామాల మధ్యలోని అటవీ మార్గంలోనూ రెండు మందుపాతరలను సీఆర్‌పీఎఫ్ 205 బెటాలియన్, కోబ్రా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి.

కిడ్నాప్ కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కుంజ అశ్విని (17) అదృశ్యంపై బుధవారం ఇల్లెందు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. పాల్వంచలోని కేఎల్‌ఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న అశ్విని మంగళవారం ఉదయం కళాశాలకు బయలు దేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆరా తీసిన కుటుంబ సభ్యులు కళాశాలకు రాలేదని తెలుసుకున్నారు. దీంతో బుధవారం విద్యార్థిని తల్లి సరిత పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఇల్లెందు ఎస్సై సందీప్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



తనిఖీలు చేస్తున్న మణుగూరు పోలీసులు



పాల్వంచలో తనిఖీ చేస్తున్న పోలీసులు

మణుగూరు టౌన్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పోలీసులు మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 3 గంటల వరకు సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దమ్మపేటలో పది..

దమ్మపేట: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం..మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 3:30 గంటల వరకు ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. మద్యం తాగి వాహనం నడిపిన పది మందిపై కేసు నమోదు చేశారు.

ఆరు బైక్‌లు సీజ్

పాల్వంచ: పోలీసులు మంగళవారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పలువురు మద్యం తాగి వాహనాలను నడుపుతుండగా బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేశారు. ఆరు మోటర్ సైకిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ వి.వినయ్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సుమన్, ఎస్‌ఐ జీవన్ రాజ్ పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని బూర్గుడెం గ్రామశివారులో బుధవారం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. నిందితులు రావిరాల వెంకటేశ్వర్లు, వేముల రమేష్, ఎస్కే గఫూర్, ఎస్కే నబిసాహెబ్‌లను అదుపులో తీసుకున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. రూ. 2700 నగదు, ద్విచక్రవాహనం, రెండు కత్తులు, నాలుగు పుంజులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మరికొందరు జూదరులు పరారయ్యారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,350 నగదు, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పట్టుబడినవారితో పోలీసులు

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు



పురుషుల విభాగంలో విజేతలతో డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఆర్చరీ పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్ విభాగంలో ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్, రికర్వ్ అంశాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈమేరకు విజేతల వివరాలను ఖమ్మం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకరయ్య వెల్లడించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాంబాబు, పుల్లారెడ్డి, జాతీయ ఆర్చరీ కోచ్ రవిశంకర్‌తో పాటు నగేష్, మారెప్ప, బొజ్జి, కె.నర్సింహామూర్తి, మతిన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో కె.లక్ష్మణ్(మహబూబాబాద్), ఆర్.రవి(మహబూబ్‌నగర్), జి.రిత్విక్(ములుగు), మహిళల విభాగంలో రఫీజా(వరంగల్), సీహెచ్.రష్మిత(సిద్దిపేట), వి.స్రవంతి(మేడ్చల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే, కాంపౌండ్ రౌండ్ పురుషుల విభాగంలో బి.రాహుల్(నిజామాబాద్), వి.శివసాయి(భద్రాద్రి కొత్తగూడెం), కె.సాయిసుష్మంత్, మహిళల విభాగంలో ఎం.శిరీషారెడ్డి(రంగారెడ్డి), ఆర్.సుజాత(మహబూబాబాద్), మున్సహరా హసీంబీ(వరంగల్), రికర్వ్ అంశం పురుషుల విభాగంలో సముద్రాల అఖిల్(మహబూబాబాద్), కోటా అచ్యుత్(వరంగల్), కె.హర్షవర్ధన్(హైదరాబాద్), మహిళల విభాగంలో టి.చిన్మయి(హైదరాబాద్), కె.లోహిత్‌శ్రీ(భద్రాద్రి కొత్తగూడెం), కె.సింధూజ(కామరెడ్డి) మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

నేత్రదానం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ్‌నగర్‌కు చెందిన సికోలి నాగేశ్వరరావు (67) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుమారులు అవినాష్, అభిలాష్, భార్య సుజాతలు నాగేశ్వరరావు నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు దానం చేశారు.

ఎంపికైనా.. జాతీయస్థాయికి వెళ్లలేక..

- ఆర్థికసాయం కోసం గిరిజన క్రీడాకారుడి ఎదురుచూపు
- ఈ నెల 5 నుంచి జార్ఖండ్‌లో పోటీలు



మనోజ్‌కుమార్

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీ కట్టంవారిగూడెం గ్రామానికి చెందిన తాటి మనోజ్‌కుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత నవంబర్ 5న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ట్రిపుల్ లాంగ్ జంప్‌లో మనోజ్ ద్వితీయస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ 30న సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 5 నుంచి 8 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఆ పోటీల్లో పాల్గొనేందుకు జార్ఖండ్ వెళ్లేందుకు చార్జీలు కూడా లేక నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన క్రీడాకారుడు తాటి మనోజ్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దాతలు, ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆర్థికసాయం చేసేవారు 93918 81968 (తాటి నవీన్) నంబర్‌కు ఫోన్‌పే చేయాలని కోరుతున్నాడు. కాగా జాతీయస్థాయికి ఎంపికైన మనోజ్ కుమార్‌ను అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది అభినందించారు. సమస్య తెలుసుకుని రూ. 6 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మాంజా దారం తగిలి మెడకు తీవ్రగాయం

పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలింపు



తీవ్రంగా గాయపడ్డ కృష్ణారావు

కొత్తగూడెంటౌన్: కొత్త సంవత్సరం రోజు విషాదం చోటుచేసుకుంది. గాలిపటానికి ఉన్న దారం మెడకు తగిలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన ఏరువ కృష్ణారావు కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా స్వగ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా రామవరం ప్రాంతంలో పతంగికి ఉన్న మాంజా దారం తెగి గొంతుకు తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించగా, వారు చేరుకుని ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

నిషేధం విధించినా యథేచ్ఛగా విక్రయాలు



దుకాణంలో విక్రయిస్తున్న మాంజా దారం

చుంచుపల్లి: గాలిపటాలు ఎగురవేసేందుకు ఉపయోగించే మాంజా దారంతో మనుషుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ప్రమాదకరమైన మాంజాను విక్రయించవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నా, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేస్తున్నా యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. బుధవారం కొత్తగూడెం రామవరంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు ఏరువ కృష్ణారావు గొంతుకు మాంజా దారం తగిలి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏటా పక్షుల ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోతున్నాయి. సంక్రాంతి సమయంలో అందరూ గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఇందుకోసం మాంజాదారం వినియోగిస్తున్నారు. నైలాన్, సింథటిక్ దారానికి గాజు, ప్లాస్టిక్ పొడి పూసి ఈ దారాన్ని తయారు చేస్తారు. గాలిపటాలు ఎగురవేసి దారం రోడ్లపై వదిలేసి వెళ్లిపోతుండటంతో వాహనదారులకు సమస్యగా మారింది. పర్యావరణానికి ప్రమాదమని జాతీయ హరిత ట్రిబ్యునల్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ దారాన్ని నిషేధించింది. ఇక చైనా మాంజా దారం మరింత ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన ఈ మాంజా చుట్టుకుని పక్షులు, మూగజీవాలతోపాటు మనుషులూ ప్రమాదాల బారినపడుతున్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2016 జనవరిలో చైనా మాంజాను నిషేధించాయి. చైనా మాంజాను విక్రయిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం రూ. లక్ష జరిమానా, ఐదు నెలల జైలు శిక్ష విధించవచ్చు. అటవీ, పోలీస్‌శాఖ అధికారులు తరుచుగా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చైనా మాంజా వాడటం నేరం



పతంగులు ఎగరేసే యువకులు నిషేధిత చైనా మాంజా దారం వినియోగిస్తే జరిమానా, జైలు శిక్ష తప్పదు. మాంజాతో జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వీటి విక్రయాలు జరగకుండా జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

–కిష్టాగౌడ్, డీఎఫ్‌ఓ

రెండు బైక్‌లు ఢీ

- నలుగురికి గాయాలు

చర్ల: మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని నలుగురు గాయపడ్డారు. మండలంలోని కలివేరు గ్రామానికి చెందిన కారం రామారావు ఆర్.కొత్తగూడెం నుంచి మరో యువకుడితో కలిసి బైక్‌పై కలివేరు వైపునకు వెళ్తున్నాడు. అదే సమయంలో బట్టీగూడేనికి చెందిన సోడి జోగా మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై భద్రాచలం వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సత్యనారాయణపురం హైస్కూల్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జోడి జోగా, కూరపాటి చరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారం రామారావు, సోడి హరీష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైవారిని అక్కడి నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చోరీ నగలు రికవరీ



బాధితుడికి నగలు అందజేస్తున్న ఎస్సై రాజమౌళి

గుండాల: చోరీ కేసులో వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేసి బుధవారం జ్యూయలరీ యజమానికి అందించారు. ఈ సందర్భంగా గుండాల ఎస్సై రాజమౌళి మాట్లాడుతూ మండల కేంద్రంలోని మణికంఠ నగల షాపులో చోరీ జరిగిన మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి సొత్తు రికవరీ చేసి బాధితుడు కదిరి శ్రీనివాస్‌కు అందజేశామన్నారు. పోలీస్ శాఖ ఎల్లవేళలా ప్రజల సంక్షేమం, రక్షణ కోసమే పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.